క్లుప్తంగా

కూలీలకు సౌకర్యాలు కల్పించండి



ఉపాధి సిబ్బందికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: ఉపాధి పనులకు వచ్చే కూలీలకు వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగేలా సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఏపీఓ రామన్న, ఈసీ రంగస్వామితో కలిసి టీఏ, ఎఫ్ఏలకు 750 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం ఏడు గంటల్లోపు పనుల్లోకి వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో సగటున రూ.290 దినసరి కూలీ కల్పిస్తున్నట్లు ఏపీఓ తెలిపారు. గ్రామాల్లో కొత్తగా ఇంకుడు గుంతలను తవ్వే పనులను ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు.

సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ జయకర్

సి.బెళగల్: మండల రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్- సొసైటీ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం చైర్మన్ జయకర్ సూచించారు. ఈ మేరకు బుధవారం సి.బెళగల్ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం సీఈఓ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చైర్మన్ రైతు రుణాలు, ఇతర సేవలను వివరించారు. సి.బెళగల్‌లో తక్కువ ధరకు అందుబాటులో ఉన్న జన ఔషధి మందులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేనేజర్ నాగమద్దిలేటి, క్లర్క్ ఖాజా హుసేన్, సిబ్బంది చంద్రశేఖర్, శివ తదితరులు ఉన్నారు.

ఉదయాన్నే పనుల్లోకి రావాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: మండుతున్న ఎండల దృష్ట్యా ఉపాధి పనులు చేసే కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా ముగించుకుని వెళ్లాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఏపీఓ మోదీన్‌బాషా తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను ఏపీఓ పరిశీలించి వారితో మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా కూలీలంతా వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకోవాలని ఏపీఓ సూచించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే జాబ్‌కార్డు మంజూరు చేసి పనులు కల్పిస్తామన్నారు. సిబ్బంది ఆయా గ్రామాల్లోని కూలీలందరికీ పనులు కల్పించడంతో పాటు, పనిచేసే ప్రదేశంలో కూలీలకు అవసరమైన మంచినీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఏపీఓ ఆదేశించారు.

కొనసాగుతున్న ఇంటింటికీ వైద్య పరీక్షలు



పాణ్యంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పాణ్యం: ఎన్‌సీడీసీడీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, క్యాంప్ అధికారి శివశంకర్ తెలిపారు. బుధవారం పాణ్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటిలో దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు ఎంత మంది ఉన్నారు, వారికి షుగర్, బీపీతో పాటు ఇతర పరీక్షలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ

పాణ్యం: ఐదో తరగతిలో ప్రవేశానికై నిర్వహించిన జవహర్ నవోదయ పరీక్ష ఫలితాల్లో మండలంలోని విజయనికేతన్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. నవోదయ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన బుధవారం అభినందించారు. తమ విద్యార్థులు ఏటా నవోదయలో, సైనిక పాఠశాలలో సీట్లు సాధిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జ్ మురారి వేణుగోపాల్, హాస్టల్ ఇన్‌చార్జ్ రాజశేఖర్ రెడ్డి, కోఆర్డినేటర్లు బ్రహ్మం, జహీర్, తదితరులు పాల్గొన్నారు.



నేలకొరిగిన ఆశలు

అకాల వర్షాలు, ఈదురుగాలులు రైతులకు తీరని నష్టాన్ని మిగిలించాయి. మంగళవారం సాయంత్రం వీచిన గాలులకు చేతికొచ్చిన పలు పంటలు నేలకొరిగాయి. మామిడి కాయలు రాలిపోయాయి. పాణ్య మండలంలో ఈదురు గాలులకు సుగాలిమెట్ట వద్ద సాగు చేసిన అరటి పంట పూర్తిగా దెబ్బతినింది. పెద్ద సంఖ్యలో చెట్లు విరిగిపడ్డాయి. అలాగే పాణ్యం శివారులో మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఈ ఒక్క మండలంలోనే వంద ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

– పాణ్యం

భక్తులకు అన్నదానం

కర్నూలు(రూరల్): శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తుల ఆకలి తీర్చేందుకు మండల పరిధిలోని కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి పక్కన నందనపల్లె వేణుగోపాలస్వామి ఆలయ ప్రాగణంలో అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. కర్నూలుకు చెందిన రామచంద్రయ్య ఆధ్వర్యంలో మార్చి 18వ తేదీ నుంచి రోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అన్నదానం నిర్వహిస్తున్నారు. భక్తుల ఆకలి తీర్చే కార్యక్రమం తమకు ఎంతగానో సంతృప్తి నిస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ముందుకు పారని మురుగు



కాలువలో పేరుకుపోయిన చెత్త

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో మురుగు కాలువల వ్యవస్థ దారుణంగా ఉంది. కాల్వల్లో పూడిక చేరడంతో మురుగు నీరు నిల్వ ఉండిపోయి దుర్వాసన వస్తోంది. చెత్తా చెదారానికి తోడు దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండాపోతోంది. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రచారానికే పరిమితమైంది. గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రభుత్వ అంగన్‌వాడీ సెంటర్‌ను అనుకొని కాల్వల్లో పేరుకుపోయిన మురుగు నిల్వలు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.

అలుముకొన్న నిర్లక్ష్యం

సమయానికి విధులకు వచ్చామా.. వెళ్లామా అనే ధ్యాసే తప్ప పనుల్లో అధికారుల్లో జవాబుదారీతనం కొరవడింది. పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించడం మానేశారు. స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించడం.. మరునాడే వదిలేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన న్యాయమూర్తి



కోడుమూరు ఎస్సీ హాస్టల్లో విద్యార్థితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఎస్సీ హాస్టల్‌ను బుధవారం డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి సందర్శించారు.తన మాట వినలేదంటూ 7, 8వ తరగతుల విద్యార్థులను టెన్త్ విద్యార్థి దారుణంగా కొట్టిన ఘటనపై ఆయన హాస్టల్లో బాధిత విద్యార్థులతో మాట్లాడారు. అలాగే హాస్టల్లోని మిగతా విద్యార్థులను విచారించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిదేవి, ఏఎస్‌డబ్ల్యూఓ లీలావతి, ఎస్ఐ శ్రీనివాసులు, వార్డెన్ వలి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న డీపీఎం చంద్రశేఖర్

సి.బెళగల్: మండలంలో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) చంద్రశేఖర్ అన్నారు. బుధవారం వ్యవసాయ సిబ్బంది ముడుమాల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ 2025 – 26 కార్యచరణ రూపకల్పనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులను పొందవచ్చన్నారు. ఏకకాలంలో నవధాన్యాలు వంటి పలు రకాల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. మండల ఇన్‌చార్జ్ రవిసాగర్, యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటేష్, శేఖర్, ఎస్ఎఫ్ఏ సిబ్బంది జగదీష్, వీహెచ్ఏ నాగన్న, ఎంపీఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కల్లూరు: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఏఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం తడకనపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచ్ సహారాబీ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేల బాగుంటుందన్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటలు తినడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పచ్చి రొట్టె ఎరువులు భూమిలో వేసి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తన గుళికలు తయారు చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ మాబువలి, వెలుగు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూవివాదాలకు చెక్



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: రీసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం పాణ్యంలోని శ్రీకృష్ణ కల్యాణమండపంలో రీ సర్వేపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా తహసీల్దార్ మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేది నుంచి హద్దులు ఏర్పాటు చేసిన రీ సర్వే ప్రారంభమవుతుందన్నారు. టెక్నాలజీతో రూపొందించిన రోవర్ మిషన్ సహాయంతో రీ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి రైతులకు నోటీసులు జారీ చేసిన తర్వాతనే కొలతలు ప్రారంభమవుతాయన్నారు. పాణ్యంలో రీ సర్వే కోసం 6 టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ నాగరాజు, మైనర్ ఇరిగేషన్ డీఈ నాగన్న , అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో అధికారుల రాత్రిబస



గార్గేయపురం ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి నిద్రిస్తున్న సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, హాస్టల్ వార్డెన్

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం రాత్రి కర్నూలు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.మద్దిలేటి రాత్రి బస చేశారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్‌లపై కోపగించుకోవడం గానీ, వాదనకు దిగడం గానీ చేయరాదన్నారు. ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సీ సాంఘిక హాస్టల్ వార్డెన్ మదారి పాల్గొన్నారు.

పన్నులు తగ్గించే వరకు పోరాటం



నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (టౌన్):పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిర్మల, రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, రద్దయిన క్లాప్ ఆటోలను పునరుద్ధరించాలని, అదనంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులకు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కొరత వల్ల మురుగు సమస్య నెలకొందని, జీఓలు 196, 197, 198లను రద్దు చేయాలని, ఇంటింటికీ చెత్త సేకరణ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నగర నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, విజయ్, షరీఫ్, అబ్దుల్లా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



రైతుల సమస్యలను అధికారులకు వివరిస్తున్న సీపీఎం నాయకులు రామకృష్ణ

ఓర్వకల్లు: గుట్టపాడు వద్ద జైరాజ్ ఇస్పాత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన నీటి పైపులైన్ నిర్మాణంలో భూమిని నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. రైతుల తరపున రామకృష్ణ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా వారి పొలాల్లో పైపులైన్ పనులను ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు. పైపులైన్‌లో భూములు కోల్పోయిన రైతులకు సెంటుకు రూ.50 వేల చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పైపులైన్ నిర్మాణంలో 10 సెంట్ల కంటే ఎక్కువ భూమి కోల్పోయిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆర్డీఓ సందీప్ కుమార్‌ను కోరారు. పైపులైన్ పోయి న గ్రామాల్లో చెరువులు, కుంటలకు విద్యుత్ మోటర్ల ద్వారా నీళ్లు నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఓర్వకల్లు డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, శ్రీధర్, ఆయా గ్రా మాల రైతులు రంగస్వామి, బుగ్గరాముడు, కుర్వ మధు, వెంకటేశ్వర్లు, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో మార్కెట్ వేలాలు

కోడుమూరు రూరల్: గూడూరు నగర పంచాయతీకి సంబంధించి 2025-26 సంవత్సరానికి గాను కూరగాయల, వారపుసంత, గొర్రెల మాంసం, గొర్రెల కమేళా, పెద్ద పశువుల మార్కెట్, పెద్ద పశువుల కమేళాకు బుధవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు వేలం పాట నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను రూ.10,41,000లకు పాట పాడి ఆదాము అనే వ్యక్తి దక్కించుకోగా, గొర్రెల మాంసం వ్యాపారం రూ.39,200, గొర్రెల మార్కెట్ రూ.35,200లకు జాకీర్ దక్కించుకున్నారు. వారపు సంత, పెద్ద పశువుల మార్కెట్, పెద్ద పశువుల కమేళాకు పాట పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం పాటను 27వ తేదీకి వాయిదా వేసినట్లు కమిషనర్ తెలిపారు.

'పది' పరీక్షలకు 16 మంది గైర్హాజరు

ఓర్వకల్లు: మండలంలోని వేర్వేరు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో 222 మందికి గాను 215 మంది హాజరైనట్లు తెలిపారు. లొద్దిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 235 మందికి గాను 232 మంది,మండల కేంద్రం ఓర్వకల్లు జెడ్పీహెచ్ స్కూల్‌లో 220 మందికి 220 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 198 మందికి 197 మంది, బాలభారతి పాఠశాలలో 148 మందికి 143 మంది హాజరయ్యారని తెలిపారు.

సి.బెళగల్‌లో 15 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. బుధవారం భౌతిక, రసాయశాస్త్రం పరీక్ష నిర్వహించగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్లోని పరీక్ష కేంద్రం, ఏపీ మోడల్ స్కూల్, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో నలుగురు చొప్పున విద్యార్థులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ముగ్గురు కలిపి మొత్తం 15 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు వంశీమోహన్, బలరాముడు, రఘురామిరెడ్డి, మల్లయ్య తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కోడుమూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ వారి కడుపుకొట్టే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎందరో కార్మికులు పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను విభజిస్తున్నాయని, అడ్డుకునేందుకు కార్మికులంతా ఐకమత్యంగా పోరాడాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ నాయకులు భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలు: న్యాయవాది మహేంద్రనాథ్ రెడ్డి పట్ల అనుచితంగా వ్యవహరించిన కర్నూలు త్రీటౌన్ సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బుధవారం విధులు బహిష్కరించి సీఐ, ఎస్ఐలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చట్టం మేరకు న్యాయవాదులు ప్రశ్నిస్తే పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో మురళీమోహన్, హరినాథ్ చౌదరి, చంద్రుడు, బాలు, కృష్ణమూర్తి, సంపత్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాంకు వినతి పత్రమిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం దగ్గర ఆ పార్టీ మండల నాయకులు మధు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ బస్తిపాడు పొలిమేరలో ఉన్న చెన్నరాయుని తిప్ప రిజర్వాయర్‌ను నీళ్లతో నింపి పంట కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో 10 గ్రామాలకు ఆయకట్టు వస్తుందని రెండు పంటలు పండుతాయన్నారు. దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్, కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుంచి వెలువడే వ్యర్థపదార్థాలను అరికట్టాలని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ఉలిందకొండ గ్రామంలో ప్రభుత్వ భూములకు ఎల్‌పీఎం నెంబర్లు ఇవ్వాలన్నారు. ఎర్రకత్వ, యాపర్లపాడు, కొంగనపాడు రోడ్లను బాగు చేయాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాంకు వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు షేక్షావలి, శాంతమ్మ, శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనను పూర్తి చేయరూ?



గోరంట్ల-కొత్తపల్లె వంతెనను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: హంద్రీనదిపై మధ్యలో ఆగిపోయిన గోరంట్ల – కొత్తపల్లె వంతెన నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గఫూర్ మియ్యా కోరారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించారు. నిర్మాణ పనులు ఆగిపోయిన గోరంట్ల-కొత్తపల్లె వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలో హంద్రీ నదిపై మొదలు పెట్టిన గోరంట్ల- కొత్తపల్లె వంతెన నిర్మాణం తర్వాత ప్రభుత్వం మారడంతో మధ్యలో ఆగిపోయిందని, దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు వీరన్న, మునిస్వామి, నరేష్, మాదన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కర వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలతో వచ్చిన వారందరి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామన్నారు. రెవెన్యూ సదస్సులో రైతులను నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణను అదేశించారు. అనంతరం పొదుపు గ్రూపులకు రూ.38 లక్షల బ్యాంక్‌లింకేజ్ రుణాలు అందజేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్త, మాజీ ఎంపీపీ శ్రీనివాస రెడ్డి, కన్వీనర్ సత్యంరెడ్డి, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలను బాగు చేయండి





పశు వైద్యశాలలో పెచ్చులూడిన దృశ్యం, పెచ్చులూడిన భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్న అధికారి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో పశు వైద్యాశాలను బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో పశు వైద్యాశాల లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రంలోని ఒక గదిలో కొనసాగిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతున్నాయి. గతంలో ఓ రైతు పశు వైద్యాశాలకు వచ్చినప్పుడు పెచ్చులు ఉడిపడడంతో తృటిలో తప్పించుకున్నాడు. పశు వైద్యాధికారి భయంభయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పశువైద్యశాలను బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.